జాబ్‌మేళాకు విశేష స్పందన


ఇంటర్వ్యూలో పాల్గొన్న విద్యార్థిని

రాంనగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. అమెజాన్, కాగ్నిజాంట్, ఒరాకిల్, క్రాంప్టన్ గేమ్స్, మ్యాజిక్ బస్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాలో 60 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశం పొందారు. ఈ మేళాను ఆ విద్యా సంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

రాంనగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసి వాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవనం, కవాడిగూడ డివిజన్ ఎల్ఐసీ కాలనీలోని గ్రంథాలయం, అంబర్‌పేటలోని గ్రంథాలయ భవనాలను నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, సెక్షన్ ఇన్‌చార్జి సుఖేష్‌లతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠకులకు కావాల్సిన దినపత్రికలు, వారపత్రికలు, నవలలు, విద్యార్థుల కోసం పోటీ పరీక్ష పుస్తకాలను, ఫర్నీచర్ ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బాకారంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం త్వరలో పాఠకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఫిలిం సెన్సార్ బోర్డు అడ్వయిజరీ ప్యానెల్ కమిటీ మెంబర్‌గా దాసోజు నాగభూషణంచారి


నాగభూషణంచారి

అంబర్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రీజియన్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిలిం సెన్సార్ సర్టిఫికేషన్ సభ్యులుగా అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి నియమితులయ్యారు. ఈ మేరకు ఫిలిం సెన్సార్ బోర్డు హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ పిపాలికుమార్ ఆయనకు నియామక పత్రం శనివారం అందజేశారు. నాగభూషణంచారి మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రిస్క్ తీసుకుంటేనే ఉన్నత స్థాయికి..

బర్కత్‌పుర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీవ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి ఉన్నత స్థానాల్లో నిలుస్తారని ప్యాక్‌సెట్ వైస్ ప్రెసిడెంట్ అనుపమ రాజన్ అన్నారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్‌ఎల్‌ఆర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సౌజన్యంతో శనివారం బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల ఆడిటోరియంలో హెచ్‌ఆర్ అండ్ టీపీవో కాన్‌క్లేవ్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వేదాంతం సంయుక్త సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిస్క్ తీసుకునే వ్యక్తిగా ఉండడం వల్ల ప్రపంచంలో మన మెదడుకు ఆహారాన్ని ఇస్తుందన్నారు. మనం చిన్నచూపు చూసుకోకుండా స్వేచ్ఛగా కమ్యూనికేట్ చేసే ధైర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ కాలేజీల టీపీవోఎస్, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్‌తో పాటు ఎక్స్‌ఎల్‌ఆర్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ అమిత్ సహా, మేనేజర్ రవిచంద్ర, అసోసియేషన్ అధ్యక్షుడు ఆలీముద్దీన్, ఉపాధ్యక్షురాలు వేదాంతం సంయుక్త, ఫాతీమా, చైతన్య భారతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


మధుమతి, గోనె సాల్మన్‌రాజులను అభినందిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఎల్‌బీస్టేడియంలో సీఎం పర్యవేక్షణలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కమిటీలో గాంధీనగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు మధుమతిసురేందర్, గోనె సాల్మన్‌రాజులు నియమితులయ్యారు. వారిని శనివారం తన కార్యాలయంలో అంజన్‌కుమార్‌యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని తెలిపారు. అనంతరం క్రిస్టియన్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను కూడా మధుమతి, సాల్మన్‌రాజు ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

సాంస్కృతిక, కళా కార్యక్రమాలకు ప్రోత్సాహం

చిక్కడపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలిగా నగరంలో జరిగే సాంస్కృతిక, కళా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు ప్రముఖ నాట్యగురువు డా. ఎస్‌పి భారతి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె త్యాగరాయగానసభలో విలేకరులతో మాట్లాడారు. నగరంలో ఆదివారం జరిగే రెండు సాంస్కృతిక కార్యక్రమాల్లో తాను ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు డా. భారతి తెలిపారు. సాంస్కృతిక, కళా కార్యక్రమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తాను బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారి సేవాస్వర్ణనంది అవార్డుల ప్రదానసభతో పాటు బిర్లా సైన్స్‌సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో విజయమాధవి అకాడమి ఆధ్వర్యంలో జరిగే వెండి వెలుగు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు

సహకార బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి

బర్కత్‌పుర, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా సహకార బ్యాంకింగ్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖలకు చెందిన నిధులను కొంత భాగం సహకార బ్యాంకుల్లో డిపాజిట్ చేసి కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో తెలంగాణ సహకార సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాల్గవ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో రెండంచెల వ్యవస్థను అమలు చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సరైనదన్నారు. యూనియన్ అధ్యక్షుడు బీఎస్ రాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్రరావు, బోస్ కె.వి, రవికుమార్, రవీంద్రనాథ్, శ్రీనివాస్, బాలరాజు పాల్గొన్నారు.

గ్రూప్ - 2 పరీక్షలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బర్కత్‌పుర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ - 2 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సెంటర్లకు సమయానికి వెళ్లే విధంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు తెలిపారు. ఆది, సోమవారాలలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. నాంపల్లి పరిధిలో 29, ఖైరతాబాద్ పరిధిలో 24, ఉస్మానియా యూనివర్సిటీలో 16 పరీక్ష సెంటర్లు ఉన్నాయని, వీటితో పాటు సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్ సెంటర్లకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. 106 ఆర్టీసీ బస్సులను 101 పరీక్ష సెంటర్లకు నడుపుతున్నామని పరీక్ష రాసే అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులకు ఎలావెళ్లాలో గైడ్ చేస్తారని, కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్, ఓయూ లేడీస్ హాస్టల్ వద్ద బస్సుల సమాచారం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ● మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో నూతన మెనూ ప్రారంభం

రాంనగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుకుల హాస్టళ్లలోని విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. నగరంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన శనివారం సందర్శించి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు జరుగుతున్న మెనూను పరిశీలించారు. కిచెన్, బాత్రూమ్, సైన్స్, కంప్యూటర్, రోబోటిక్ ల్యాబ్, డార్మెటరీలను తనిఖీ చేశారు. వాటి నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించి ఉద్యోగం పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందించిన మెనూ విద్యార్థులకు అందించాలని ప్రిన్సిపాల్ వాణికి సూచించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.చల్లాదేవి, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాజు నాయక్‌లు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీపీ ఆనంద్


బాగ్‌లింగంపల్లిలోని చాట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సీవీ ఆనంద్

లోప్రెషర్, కలుషిత నీటి సమస్యలు లేకుండా చర్యలు

చిక్కడపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లోప్రెషర్, కలుషిత తాగునీటి సరఫరా సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. ప్రజలవద్దకే కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శనివారం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ డివిజన్‌లోని చిక్కడపల్లి బాపునగర్ బస్తీలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్‌కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దామోదర్, బస్తీవాసులు శ్రీను, హరీష్, నాగరాజు, శోభ, కోటేశ్వరి, డీటీ విజయలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాలు ఏకీకృతం కావాలి

తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న రవీంద్రభారతిలో జరిగే బ్రాహ్మణ సమ్మేళనం విజయవంతం చేయడానికి అన్ని బ్రాహ్మణ సంఘాలు ఏకీకృతం కావాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనంలో బ్రాహ్మణ సంఘం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నదన్నారు. శనివారం నల్లకుంట డివిజన్‌లోని సమితి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 29న బ్రాహ్మణ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రెండవ విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బ్రాహ్మణ దామాషా ప్రకారం తమ వర్గానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు అర్కర్ గోపాల్‌రావు, ఏపీ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుశీల్‌కుమార్, డాక్టర్ వింజమూరు సుధాకర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యకర్తలు ముందుడాలి


సాయితేజ్‌ను అభినందిస్తున్న ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తదితరులు

కవాడిగూడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్‌కుమార్‌యాదవ్ నాయకులు కార్యకర్తలక పిలుపునిచ్చారు. ఇటీవల యూత్‌కాంగ్రెస్‌కు జరిగిన ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శిగా సర్వేసాయితేజ్ ఎన్నికైన సందర్భంగా శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని జెబి అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన అభినందనసభలో ఎం అరవింద్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వి డి కృష్ణ, ఎ బ్లాక్ పార్టీ మాజీ అధ్యక్షుడు కెఆర్‌కె ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాంతికుమార్, భిక్షపతి, కనకరాజు, విదుర్ చావ్లా, భాగ్యరాజ్ తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో వసతులను మెరుగుపర్చాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్


భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో కామన్ డైట్ మెనును ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలు అవుతున్న ఘటనలు విరివిగా జరుగుతున్నాయని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విద్యార్థులకు వడ్డించే వంటకాలను పరిశీలిస్తూ పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్ శ్రీనివాస్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయి, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, సీనియర్ నాయకులు రహీం, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

ముషీరాబాద్: ఆపదలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నేతలకు అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఇంటికి వెళ్లికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు కృష్ణ అయ్యప్పస్వాములు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ లావణ్య

గోల్నాక, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి దిశలో ముందుకు నడిపిస్తున్నానని ఆయన చెప్పారు. శనివారం గోల్నాక డివిజన్‌లోని తులసీరాంనగర్(లంక)లో రూ.29 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించున్న సీసీరోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన శనివారం చేశారు. అనంతరం వారు బస్తీలలో పర్యటించి ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో ముందుకునడిపిస్తున్నానని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, వీధిదీపాల ఏర్పాటు తదితర సమస్యలను తీర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లేష్‌గౌడ్, ఎ.సురేష్‌గౌడ్, బి.లింగంగౌడ్, ఆర్.దేవేందర్, వై.బుచ్చిరెడ్డి, పడకంటి అంజయ్యచారి, ప్రభాకర్‌ముదిరాజ్,పి.సంతోష్‌కుమార్, ఉమాదేవి స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదత్త జయంతి

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధిలో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్, శ్రీసాయిదత్త పీఠం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీదత్త జయంతి మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం 9.30 గంటలకు శ్రీదత్త జయంతి ఉత్సవం పూజా కార్యక్రమం కనులపండువగా జరిగాయి. ప్రతీ సంవత్సరం వైభవంగా నిర్వహించే శ్రీదత్త జయంతి కార్యక్రమంలో భాగంగా 15వ యేట జరిగిన ఈ ఉత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ యాకర.అమృతతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక భక్తిభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీ.హెచ్.సాయిమోహన్, శ్రీసాయిదత్త పీఠం మేనేజింగ్ ట్రస్టీ పి.ఎస్.ఎన్.మూర్తి, శ్రీసాయి దత్తపీఠం ట్రస్టీలు మురళీకృష్ణ, మధుసూదనశర్మ పాల్గొన్నారు.

● బాగ్‌అంబర్‌పేటలో జీఏఎస్ఎస్‌గిరి ఆధ్వర్యంలో శ్రీదత్తజయంతి ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా వాళ్లకు చట్టాలు వర్తించవా..?

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినిమా నటులు అయినంత మాత్రం చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సినిమా చూసేందుకు వెళ్లి మహిళ ప్రాణాలను బలిగొన్న సినిమా నటులను అరెస్టు చేస్తే పెడబొబ్బలు పెడుతున్న రాజకీయ నాయకులు, మహిళ చనిపోయినప్పుడు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఎవరైనా చట్టాలకు అతీతులు కారనే విషయం రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండేవారికి తెలియంది కాదన్నారు. సినీ పరిశ్రమకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు.

28 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్నె ఈశ్వరప్ప

రాంనగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జాబితాలో లేని 28 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్నె ఈశ్వరప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఓబీసీ సాధన సమితి అడహక్ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్రంలోని 28 బీసీ కులాలు ఓబీసీ సర్టిఫికెట్ లేక ఆ కులాలకు చెందిన విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఓబీసీ సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో 28 కులాలకు చెందిన ప్రతినిదులు మోహన్‌చౌహాన్, చెట్టిపల్లి శివాజీ, వేముల శ్రీనివాస్, ప్రవీణ్, వేదాకర్, బొప్పల శ్రీనివాస్, రామస్వామి, బాబు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సాధన సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఓబీసీ సాధన సమితి రాష్ట్ర నూతన కమిటీని శనివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా డాక్టర్ వెన్నె ఈశ్వరప్ప, అధ్యక్షుడుగా చెట్టిపల్లి శివాజీ, కార్యనిర్వాహక అధ్యక్ష కార్యదర్శిగా శ్రీనివాస్, మోహన్‌చౌహాన్, కోశాధికారిగా వేముల శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా బి.ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా బొప్పల శ్రీనివాసులు, రామస్వామి, లలితమ్మ, కనకమ్మలు నియమితులైనట్లు ఎన్నికల ప్రకటించారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌గౌడ్

ముషీరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను నెరవేర్చుతామని ప్రజలను నమ్మించి.. అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చడం లేదని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ విమర్శించారు. శనివారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం అధ్యక్షతన కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ, ఆరు అబద్ధాలు, 66 మోసాలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్యామ్‌సుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి డబ్బులిచ్చి పదవిని కాపాడుకుంటున్నాడని అందుకే ప్రజల సొమ్మును దోచుకుంటున్నాడని ఆరోపించారు. పేదల నమ్మకాన్ని వమ్ముచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి కాంగ్రెస్‌కు పట్టం కడితే ఆ పార్టీ నేతలు సైతం ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కానీ ప్రధాని నరేంద్ర మోదీ పేదలకు పక్కా గృహాలు నిర్మిస్తూ నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందేలా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజలకోసం పనిచేసే పార్టీ బీజేపీ అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియా నవీన్ గౌడ్, రచనశ్రీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్‌కుమార్, సదానంద్‌ముదిరాజ్, నందు, నాయకులు ఆర్.విశ్వం, నందగిరి నర్సింహ, రాంరెడ్డి, శేషసాయి, బాబు తదితరులు పాల్గొన్నారు.

గుల్షన్‌నగర్‌లో విరిగిపడిన విద్యుత్ స్తంభం


ఆటోపై పడిన విద్యుత్ స్తంభం

ముషీరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్ నగర్‌లోని ఐటీఐ వీధిలో ఓ వాహనం విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ ఘటనలో విరిగిన స్తంభం స్క్రాబ్ లోడ్‌తో ఉన్న వాహనంపై పడడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తలేదు. అధికారులు వెంటనే అప్రమత్తంమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గౌసుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్‌శాఖ ఏఈ గోవర్ధన్, సబ్ ఇంజనీర్ సతీష్, లైన్‌మెన్ యూసుఫ్‌ఖాన్‌లకు ఫిర్యాదు చేశారు. శనివారం విరిగిన స్తంభాన్ని తొలగించి ఆ స్థలంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. స్తంభాన్ని ఢీకొట్టిన వాహనంలో స్క్రాబ్ లోడ్ అధికంగా ఉండడంవల్ల అదుపు తప్పి ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి తగలడంతో ఈ ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

జీఓ 317ను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి ● ఇందిరాపార్కు వద్ద జీఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన దీక్ష


ఇందిరాపార్కు వద్ద జరిగిన దీక్షలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

కవాడిగూడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 317 వల్ల స్థానికత కోల్పోయి ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ జీఓ బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జీఓ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జీఓ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో మహా నిరసన దీక్ష చేపట్టారు. ఈ మహా నిరసన దీక్షకు అన్ని జిల్లాల్లో ఉన్న బాధిత ఉద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా 'స్థానికత మా జన్మ హక్కు' అంటూ బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ చైర్మన్ విజయ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, జేఏసీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేని పరిష్కరించగలిగే సమస్య అయినప్పటికీ 317 జీఓను సవరించకపోవడం బాధాకరమన్నారు. స్థానికత పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో స్థానికతకు విరుద్ధంగా ఉన్న జీఓ 317ను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం కమిటీ నియమించినప్పటికీ అది ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వకుండా తమకు అన్యాయం చేసిందన్నారు. 317 జీఓ వల్ల నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ వారి వారి జిల్లాలు, జోన్‌లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జేఏసీ సెక్రటరీ సందీప్, కోశాధికారి వినోద, నేతలు వెంకటేష్, ప్రవీణ్, పోచన్న, కృష్ణ ప్రసాద్, భరద్వాజ్, ఎంవీ సమియుద్దీన్, బాల ప్రసాద్‌తోపాటు బాధిత ఉపాధ్యయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ఇద్దరి అరెస్ట్

కవాడిగూడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను గాంధీనగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కవాడిగూడ సీజీవో టవర్స్ ఎదురుగా బస్సీలాల్‌పేటకు చెందిన కారు డ్రైవర్ పి.సైమన్(24), బాగ్‌లింగంపల్లికి చెందిన కారుడ్రైవర్ డి.లోకేష్(23)లు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించామన్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 30 గ్రాముల బరువు ఉన్న గంజాయి ప్యాకెట్లు దొరికాయని తెలిపారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.